
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు లాటరీ

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

5లో..

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

రేషన్ అక్రమ రవాణాకు రెడ్ సిగ్నల్

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వం 'రెడ్' సిగ్నల్ వేసింది. నల్లబజారుకు తరలే పేదల బియ్యాన్ని 'రెడ్'హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రత్యేక పరీక్ష కిట్లను పౌరసరఫరాల శాఖకు అందజేసింది. జిల్లాల వారీగా వీటిని పంపిణీ చేసింది. అక్రమార్కులపై అక్కడికక్కడే 6ఏ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాధారణ బియ్యం మాటున జరిగే.. చౌక బియ్యం అసలు 'రంగు' తేలికగా తేలనుంది.

- స్పాట్‌లోనే పేదల బియ్యం గుర్తింపు
- పరీక్షలకు పౌరసరఫరాల శాఖకు ప్రత్యేక కిట్లు
- జిల్లాలకు ఇప్పటికే పంపించిన ప్రభుత్వం
- నల్లబజారు వ్యాపారులకు ఇక 'రంగు' పడనుంది..!





పీడీఎస్ బియ్యం నిర్ధారించే కిట్

(కొల్లూరు, ఆంధ్రజ్యోతి)

పేదలకు బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ బియ్యం అంటారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే చౌక బియ్యాన్ని.. అక్రమార్కులు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బియ్యం నిల్వలు పట్టుబడినా.. అక్కడికక్కడే వాటిని నిర్ధారించే పరిస్థితి గతంలో లేదు. కానీ, ఇక నుంచి లెక్క వేరేలా ఉండనుంది. నల్లబజారులో పేదల బియ్యాన్ని స్పాట్‌లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు. ఇందుకు ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్‌లను జిల్లాకు 7 నుంచి 10 వరకు ప్రభుత్వం అందజేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని నిర్ధారించడమే కాకుండా వెనువెంటనే 6ఏ కేసు నమోదుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కిట్లు కాకినాడ పోర్టులో ఉండేవి. పోర్టుకు వచ్చే బియ్యం నిల్వలను కిట్ ద్వారా పరీక్షించేవారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గానికి పరీక్ష విధానాన్ని తీసుకొచ్చారు.

బియ్యం ఫోర్టిఫైడ్ ఇలా..

మార్కెట్‌లో సాధారణ బియ్యానికి.. ప్రభుత్వం అందించే చౌక బియ్యానికి చాలానే తేడా ఉంది. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని ఫోర్టిఫైడ్ చేసి.. పేదలకు సరఫరా చేస్తోంది. ఈ బియ్యంలో పోషకాలు ఉంటాయి. ఇందులో కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలుపుతారు. ముందుగా బియ్యాన్ని పిండిగా మారుస్తారు. అందులో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. అనంతరం ఆ పిండిని మళ్లీ బియ్యం కెర్నెల్స్(గింజలు)గా మార్చుతారు. క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలుపుతారు. ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార లోపం కూడా ఉండకూడదన్న లక్ష్యంతో అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీలో ఈ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతేడాది నుంచి ఈ విధానం పూర్తి స్థాయిలో (మిగతా 5వ పేజీలో)

ఎస్సీలకు రుణాలు

- జిల్లాల వారీగా లక్ష్యాల నిర్దేశం
- రాయితీపై యూనిట్లకు కార్యాచరణ
- కార్పొరేషన్‌ను గాడిన పెట్టే దిశగా ప్రభుత్వం



2852 యూనిట్లు.. రూ.38 కోట్ల రాయితీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే యూనిట్లకు సంబంధించి జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. బాపట్ల జిల్లాలో వివిధ కేటగిరీల్లో 912 యూనిట్లు కేటాయించగా ఇప్పటికే 2,500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో 990, పల్నాడు జిల్లాలో 950 యూనిట్లకు దర ఖాస్తులు ఆహ్వానించగా దాదాపు 5,000 వరకు వచ్చాయి. మూడు జిల్లాలకు ప్రభుత్వం కేటాయించిన రుణాలు రూ.95 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో రాయితీ రూ.38 కోట్లు, బ్యాంకులు అందించే రుణ సదుపాయం రూ.45 కోట్ల వరకు ఉండనుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం కల్పించేలా ప్రస్తుత ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన ఎస్సీ యువతకు రాయితీపై రుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రాయితీపై అందించే యూనిట్లకు లక్ష్యం నిర్దేశించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ అందించి యూనిట్లు పెట్టేలా ప్రోత్సహించేది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రాయితీపై యూనిట్లు అందించే కార్యక్రమానికి కసరత్తు జరుగుతుండడంపై ఎస్సీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల కంటే ఇప్పటికే మూడు రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో త్వరలోనే మండలాల వారీగా వాటి పరిశీలన ప్రక్రియకి ఎస్సీ కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. మండల స్థాయి అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత అవి కలెక్టర్ లాగిన్‌కు చేరడం, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి నివేదిక తర్వాత లబ్ధిదారుల తుది ప్రకటన వెలువడనున్నది.

మూడు కేటగిరీలు..

ఎస్సీ యువతకు రాయితీపై అందించే రుణాలను మూడు కేటగిరీల్లో విభజించనున్నారు. మొదటి విభాగంలో మూడు లక్షల్లోపు, రెండో కేటగిరీలో మూడు నుంచి ఐదు లక్షల్లోపు, మూడో విభాగంలో పది లక్షల్లోపు యూనిట్లను అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా కేటగిరీల్లో ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న దానిపై తర్జనభర్జన జరుగుతున్నట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్ అందించిన వివరాల ప్రకారం సాంకేతికపరమైన యూనిట్లకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందులో ఐటీ సేవలు మొదలు వెబ్‌సైట్ రూపకల్పన వరకు ఉన్నాయి. సెల్‌ఫోన్ రిపేర్ షాపులు, స్టేషనరి తయారీ, సోప్స్‌తో పాటు సౌందర్య సాధనాల తయారీ యూనిట్లకు రాయితీలో చోటు కల్పించనున్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు జవసత్వాలు అందించడంతో పాటు గతంలో లబ్ధి పొందిన వారు బకాయిలు చెల్లించడంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.36 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో బాపట్ల జిల్లా వాటా రూ.8 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కే ఎఫ్‌డీసీకి సంబంధించిన రుణాలు ఈ బకాయిల్లో ఉన్నాయి. బకాయి దారులకు గతంలోనే ఓసారి నోటీసులివ్వడం జరిగిందని, ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

ప్లాస్టిక్ రహితమే లక్ష్యం

- చీరాలలో స్వచ్ఛతా హి సేవలో కలెక్టర్

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను మార్చడమే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని కలెక్టర్ డా.వినోద్ కుమార్ తెలిపారు. గురువారం చీరాలలో స్వచ్ఛతా హి సేవ శ్రమదానం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నెహ్రూ కూరగాయల మార్కెట్ నుంచి గడియార స్తంభం కూడలి వరకు రహదారులను కలెక్టర్ శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛమైన పర్యావరణం అందుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. క్లాత్ సంచులను వినియోగిస్తాం.. ప్లాస్టిక్ నిషేధిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహ సీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, ఏఈ రవికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


శ్రమదానంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

మూడో లైన్‌పైనా.. రయ్‌రయ్

- నిడుబ్రోలు - అప్పికట్ల పట్టాలపై స్పీడ్‌టెస్టు

తెనాలి అర్బన్, దుగ్గిరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- గుంటూరు మార్గంలో నిర్మించిన మూడో రైల్వేలైనులో గురువారం కమిషనర్ ఆఫ్ రైల్వేసేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్టరన్ నిర్వహించారు. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండా రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తేల్చారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేశారు. మూడో లైను పటిష్ఠంగా ఉందని రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి చెప్పారు. ప్రాజెక్టు మేనేజర్ శేఖర్‌సాహు, ఇంజనీరింగ్ అధికారుల బృందం ఈ లైనును పరిశీలించింది. పెదవడ్లపూడి నుంచి చుండూరు వరకు స్పీడ్ టెస్టు నిర్వహించారు. రైలు వేగంగా వెళ్లేటప్పుడు స్థిరత్వం, ట్రాక్‌లో కదలికలు, బ్రిడ్జి, సిగ్నల్స్, ఎలక్ట్రిఫికేషన్, ప్రయాణికుల భద్రత అంశాలను పరిశీలించారు. 140 కి.మీ వేగంతో స్పీడు టెస్టు చేయగా, ఒకదశలో వేగాన్ని 148కి.మీ వరకు పెంచినప్పటికి ట్రాక్ పటిష్ఠంగా ఉందని గుర్తించారు. శుక్రవారం నుంచి ట్రాక్‌ను వినియోగంలోకి తేనున్నట్లు చెప్పారు. స్పీడ్ టెస్టులో డీఆర్ఎం మోహిత్ తో పాటు పలు విభాగాలకు చెందిన రైల్వే అధికారులు పాల్గొన్నారు.


మూడో లైనును పరిశీలిస్తున్నరైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, ప్రాజెక్టు మేనేజర్ శేఖర్‌సాహు, ఇంజనీరింగ్ అధికారులు

విద్యారంగం నిర్వీర్యం

- బోధనేతర విధుల్లో ఉపాధ్యాయులు
- నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరం
- రాష్ట్రస్థాయి రణభేరిలో యూటీఎఫ్ నేతల డిమాండ్

గుంటూరు విద్య, సెప్టెంబరు 25 ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఐదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయగా ఈ ప్రభుత్వం కూడా ఇదే బాటలో పయనిస్తోందని యూటీఎఫ్ నేతలు తెలిపారు. గురువారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రణభేరిలో పలువురు నేతలు ప్రసంగించారు. ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. యూటీఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ బీ గోపిమూర్తి ప్రసంగించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్ణయాల కారణంగా పది లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. సమస్యలపై ఉద్యోగులు, ఉపాధ్యా యు లతో ప్రభుత్వం చర్చించడంలేదని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బోధనేతర పనులతోనే ఉపాధ్యాయులు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. విద్యా ర్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం లేకుండా పోతుందని వాపోయారు నూతనంగా ప్రవేశపెట్టిన అ సెస్మెంట్ పరీక్షల విధానం అస్తవ్యస్తంగా మారిందన్నా రు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కే సురేష్‌కుమార్, కుసుమకుమారి, గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, ఏపీజేఏసీ రాష్ట్ర ఛైర్మన్ ఏ విద్యాసాగర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుదాస్, ఏపీఎన్జీవో ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఏపీజేఏసీ రాష్ట్ర ఛైర్మన్ విద్యాసాగర్

ధాన్యం సేకరణపై కసరత్తు



- 2 లక్షల టన్నులకు పౌర సరఫరాల శాఖ ప్రతిపాదనలు
- గత అనుభవాలతో ముందుగా మేల్కొన్న యంత్రాంగం
- ప్రభుత్వం మొగ్గు లక్ష టన్నులే..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పౌర సరఫరాలశాఖ ప్రభుత్వానికి భారీగానే నివేదికలు పంపింది. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని.. మద్దతు ధరకు కొనుగోలు చేసేలా అనుమతులివ్వాలని ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియలో అనేక ఇబ్బందులను రైతులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క సంవత్సరం కూడా ఖరీఫ్ సీజన్‌లో 30,000 టన్నులకు మించి ధాన్యం సేకరించిన దాఖలాలు లేవు. గతేడాది ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 92,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఓ విధంగా గతేడాది సేకరించిందే గరిష్ఠ పరిమాణంగా ప్రభుత్వం భావించింది. కానీ, ఇప్పుడు ఏకంగా రెండు లక్షల టన్నుల సేకరణకు పౌర సరఫరాలశాఖ అంచనాలు వేసి పంపడంతో ఏ మేరకు గ్రీన్‌సిగ్నల్ వస్తుందో తెలియాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కేటాయింపుల్లో జిల్లా వాటా లక్ష టన్నుల లోపే ఉండొచ్చనేది సమాచారం. ఇదే స్థాయిలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గత ఖరీఫ్‌లో మూడు సార్లుగా ప్రతిపాదనలు

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో తొలుత 50,000 టన్నుల సేకరణకే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగుబడులు ప్రారంభం అయిన నెలన్నరకే ఈ లక్ష్యం చిన్నబోయింది. తర్వాత ధాన్యం సేకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి నివేదించి.. మూడు సార్లుగా మరికొంత సేకరణకు అధికారులు, నేతల కృషితో అనుమతులు తెచ్చుకోగలిగారు. అదనంగా 42,000 టన్నుల ధాన్యం మద్దతు ధరకు సేకరించారు. దీంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు

మళ్లీ కొనుగోలు కేంద్రాల బాట

వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం సేకరణ అంశాన్ని ఓ ప్రహసనంగా మార్చారు. దీంతో రైతులు అయినకాడికి బహిరంగ మార్కెట్‌లోనే అమ్ముకుని సరిపెట్టుకున్నారు. అరకొరగా సేకరించిన ధాన్యానికి డబ్బులు జమ చేయడంలో వైసీపీ ప్రభుత్వం నెలల తరబడి జాప్యం చేసింది. సీజన్‌లో 30,000 టన్నుల లక్ష్యం చేరుకోవడమే గగనంగా ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగానే డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తోంది. గోనె సంచుల కొరతపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొనుగోలు కేంద్రాల బాట పట్టే అన్నదాతల సంఖ్య గత సీజన్‌లో గణనీయంగా పెరిగింది.

తప్పులు పునరావృతం కాకుండా...

జిల్లాలో సాగు విస్తీర్ణంలో దాదాపు 80 శాతం వరి పంటే ఉంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో దిగుబడులు మొదలుకుని, బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను అంచనా వేయడంలో వ్యవస్థల వైఫల్యం.. రైతుల పాలిట శాపంగా మారింది. మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీల విషయంలో కూడా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురు కావడంతో ధాన్యం సేకరణకు ప్రతిబంధకాలుగా మారాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అలాంటి ఇబ్బందులేవీ తలెత్తకుండా ముందస్తు చర్యలపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. ధాన్యం సేకరణకు సంబంధించి భారీగా ప్రతిపాదనలు పంపడంతో సరిపెట్టకుండా వాటిని గరిష్ఠంగా సాధించుకోవడానికి నేతల వైపు నుంచి కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సి ఉంది. మిల్లర్ల మాయాజాలంపై గతంలో అనేక విమర్శలు వచ్చాయి. దీనికి విరుగుడుగా గతేడాదే ప్రభుత్వం ధాన్యం రవాణా విషయంలో జీపీఎస్‌ను తప్పనిసరి చేసింది. దీనిని ఈ సీజన్‌లో పక్కాగా అమలయ్యేలా చూస్తే అవకతవకలకు చాలా వరకు బ్రేక్ పడనున్నాయి.

నాలుగు గ్రామాల్లో.. మ్యాజిక్ డ్రైయిన్లు

- హార్టికల్చర్ రైతులకు రూ.6.50 కోట్ల రాయితీ
- ఆంధ్రజ్యోతితో ఉపాధి పీడీ విజయలక్ష్మి



వేమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్ర వాతావరణంలో తీర్చిదిద్దేందుకు నాలుగు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఉపాధి హామీ పథకం పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణ పనులను బలిజేపల్లి, వేమూరు గ్రామాల్లో గోకులం షెడ్లను, జం పనిలో హార్టికల్చర్ తోటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వేమూరు మండలంలోని పోతుమర్రు, మార్టూరు మండలంలోని చిమ్మిరిబండ, చిన్నగంజాం మండలంలోని నీలాయపాలెం, అద్దంకి మండలంలోని విప్పర్లవారిపాలెం గ్రామాలను మోడల్‌గా తీసుకుని మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఎక్కడా మురుగునీరు నిల్వకుండా, నీరు ఎక్కువైతే భూమిలోకి ఇంకిపోయేలా మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగు గ్రామాల్లో 2595 మీటర్ల మేర నిర్మాణం జరుగుతుందన్నారు.జిల్లాలోని 624 ఎకరాల్లో ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. 508 మంది రైతులు వివిధ పండ్లతోటల సాగుకు ముందుకు వచ్చారని, వారికి రూ.6.50 కోట్లు రాయితీ రూపంలో మంజూరు చేశామన్నారు. జిల్లాలో 453 మినీగోకులం షెడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 45 లక్షల ఉపాధి పని దినాలను లక్ష్యంగా పెట్టుకోగా 50 లక్షల పని దినాలను పూర్తిచేసి ఇందుకు రూ.138 కోట్లు వ్యయం చేశామన్నారు. గ్రామాల్లో కంపోస్ట్ బిట్స్ నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇళ్లలో వినియోగించిన వ్యర్థాల్ని కంపోస్టు బిట్స్‌లో వేసి శుభ్రమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు.

అర్హులందరికీ సంక్షేమం అందాలి

- సూపర్‌సిక్స్ సమర్థంగా అమలు చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ యోజన తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలుపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సమర్థంగా అమలు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ప్రయోజనం కల్పించేలా రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్ కరెక్షన్ చేయాలన్నారు. ఆర్టీసీ డిపోలలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. వసతి గృహాల మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

అందుబాటులో 112 ఎంటీల యూరియా

జిల్లాలో రైతులకు అందించేందుకు 112 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాలు 26 ద్వారా గురువారం 318 మెట్రిక్‌టన్నుల యూరియాను 3,452 మంది రైతులకు పంపిణీ జరిగిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ లవన్న, సంక్షేమశాఖాధికారులు జె.రాజాదెబోరా, శివలీల, ప్రజారవాణాధికారి బి.సాంబ్రాజ్యం పాల్గొన్నారు.

తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు.. లారీ ఎక్కించి చంపేశాడు!

- మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఘాతుకం
- దాబా యజమాని సహా మరో వ్యక్తి మృతి
- శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఘటన



అయూబ్



దండాసి

కంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు ఓ డ్రైవర్ తన లారీని పైకి ఎక్కించి ఇద్దరిని చంపేశాడు! ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జలంత్రకోట సమీపంలోని దాబా హోటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్ ఖాన్ బుధవారం రాత్రి భోజనం చేసేందుకు దాబా హోటల్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటలకు భోజనం చేసి బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. దాబా యజమాని ఆయూబ్ (55) అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే డ్రైవరు మద్యం మత్తులో ఉన్నాడు. ఆ తర్వాత లారీ ఎక్కి నడుపుకుని వెళ్తుండగా.. ఆపేందుకు అయూబ్ ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని మీదుగా నడిపించడంతో ఆయూబ్ అక్కడికక్కడే చనిపోయారు. ఇది గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి (65) లారీని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అక్కడున్న వారు లారీని వెంబడించి బురగాం సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకు కేసు నమోదు చేశారు.

జల, థర్మల్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం

- జెన్కో ట్రాన్స్‌కో అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన గురువారం సచివాలయంలో ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ ఆధారపడకూడదని, వాటికి ప్రత్యామ్నాయంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జూలై నుంచి సగటున రోజుకి 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి జరుగుతోందని, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. అక్టోబరు నెలలో పండుగలు, వ్యవసాయానికి అనువైన కాలం కావడంతో, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ కోరారు. వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీ పృథ్వీతేజతో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎన్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభలో 'సినీ' రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

- జగన్‌పై ధ్వజం... చిరంజీవి ప్రస్తావన
- బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాసన సభ వేదికగా 'సినీ' రగడ రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్రంగా స్పందించారు. దీనికి ప్రతిస్పందనగా చిరంజీవి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉండగా సినీ ప్రముఖులను అవమానించారని... ఆయన వైఖరికి ఇదొక ఉదాహరణ అని కామినేని శ్రీనివాస్ గురువారం సభలో పేర్కొన్నారు. దీనిపై వారి వ్యాఖ్యలు, స్పందన, ప్రతిస్పందనలు ఇవి...

చిరంజీవి గట్టిగా అడిగితే...: కామినేని



'జగన్మోహన్‌రెడ్డిది ఎంత సైకో మనస్తత్వమంటే.. చిరంజీవిని, ఆయన భార్య సురేఖను ఒకసారి రమ్మంటే వెళ్లినప్పుడు కారు పోర్టికోలోకి వెళ్లగానే జగన్ దంపతులు వచ్చి లోపలకు తీసుకెళ్లారు. తర్వాత సినిమా వాళ్ల సమస్యలపై చర్చించాలని అడిగితే ఆయనే (జగన్) జాబితా పంపారు. ఆ జాబితాలో బాలకృష్ణ, ఇతరులెవరూ లేరు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉంటున్న ప్రభాస్, మహేష్, రాజమౌళిని రమ్మన్నారు.. వాళ్లు రాబోమన్నా చిరంజీవి గారే రమ్మని అడగడంతో మొహమాటంతో వస్తే.. ఫస్ట్ షాక్. గేటు దగ్గరే కార్లు ఆపేశారు. అందరినీ కార్లు దిగి రమ్మన్నారు. అదేంటనుకుని కార్లు దిగి లోపలకు వెళ్లారు. లోపల సెకండ్ షాక్. ఇంత పెద్దవారిని పిలిచి అక్కడ పోసాని కృష్ణమురళి లాంటి వారిని కూర్చోబెట్టారు. తర్వాత మూడో షాక్. సీఎం గారు మిమ్మల్ని కలవట్లేదు.. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి మాట్లాడతారని అన్నారు అప్పుడు చిరంజీవి గారు కొద్దిగా గట్టిగానే.. అదేంటండి.. మీరు పిలిచారని నేను వీరందరినీ తీసుకొస్తే ఆయన రానంటారా.. అని అడిగారు. అప్పుడు జగన్ వచ్చారు. మీరొక తండ్రిలా సినిమా పరిశ్రమను జాగ్రత్తగా చూసుకోండని చిరంజీవి మంచిఉద్దేశంతో రిక్వెస్ట్ చేస్తే.. ఆ వీడియో బయటకు రిలీజ్ చేశారు. ఎంత అవమానం? శాడిస్ట్ మెంటాలిటీకి ఇంతకన్నా ఉదాహరణ ఏమి కావాలి?'

గట్టిగా ఎవరడిగారు: బాలకృష్ణ



'అప్పుడు ఇండస్ట్రీ వాళ్లందరూ సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు ఈయన (జగన్) వచ్చాడు అన్నది అబద్ధం. అక్కడ గట్టిగా ఎవ్వడూ అడగలేదు.. సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారు.. ఆ వీడియో పెట్టడం, అవమానించడం నిజం. ఆయన (చిరు) ఏదో పెద్దగా చెబితే ఈయన (జగన్) దిగొచ్చాడంటా.. మొన్న కూడా నాకు ఇన్విటేషన్ వచ్చింది. ఇక్కడ ఫిల్మ్ డెవలప్మెంట్ జాబితా తయారు చేయమని! అందులో నాది తొమ్మిదో పేరు! మంత్రి కందుల దుర్గేశ్ గారిని అడిగా.. ఎవడు వాడు వేసిందని! మర్యాద ఇవ్వడం మానవత్వం. (కామినేని వైపు చూస్తూ..) అదేదో గట్టిగా.. ఎవడడిగాడు? గట్టిగా అడిగితే పంపించారా లోపలికి! ఆ రోజు గట్టిగా అడిగిన వారెవరూ లేరు. మీరు తెలీకుండా మాట్లాడుతున్నారు. అయితే ఆయన(చిరంజీవి)కు అవమానం జరిగింది వాస్తవమే. (స్పీకర్ వైపు చూస్తూ..) సారీ.. వివరణ ఇవ్వడమే నా ఉద్దేశం!'

బాలకృష్ణ అందుబాటులో లేరు: చిరంజీవి



'ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు చిత్రపరిశ్రమలోని కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిల్మ్ చాంబర్ ప్రతినిధులు నా దగ్గరకు వచ్చి, నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా టికెట్ల ధరల పెంపుదల గురించి ప్రభుత్వంతో మాట్లాడమని నన్ను కోరారు. వారిలో దర్శకులు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరోలు మహేశ్, ఎన్టీఆర్, నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ఉన్నారు. వారి సూచనల మేరకు అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. సీఎంతో చర్చించి చెబుతానని ఆయన చెప్పారు. ఆ తర్వాత మంత్రి నాకు ఫోను చేసి... జగన్ వన్ టు వన్ కలుస్తారని చెప్పి, లంచ్‌కి ఆహ్వానించారు. నేను సీఎం నివాసానికి వెళ్లగా ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించాను. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్ని నాని ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందు వల్ల ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పది మందిమి వస్తామని చెబితే సరేనన్నారు. ఆ సమయంలో బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలకృష్ణను కలవమని జెమిని కిరణ్‌ను పంపించాను. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఓ విమానం ఏర్పాటు చేసి ఆర్. నారాయణమూర్తితో సహా మరికొందరితో వెళ్లి సీఎంను కలిశాం. సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించి, ప్రభుత్వ సహకారం కోరాను. నేను చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అంగీకరించింది. ఆ నిర్ణయం వల్లే 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' వంటి సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. నేను సీఎంతోనైనా, సామాన్యుడితో అయినా నా సహజ ధోరణిలోనే మాట్లాడుతాను.'

పత్తి క్వింటా రూ.8,110

- వచ్చే నెల నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 4.02 లక్షల హెక్టార్లలో పత్తి పండించగా, 7.12 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలును సీసీఐ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తి క్వింటా రూ.8,110, మధ్యస్త పింజ పత్తి క్వింటా రూ.7,710 చొప్పున కొననున్నట్టు పేర్కొంది. సీసీఐ కొత్త నిబంధనల మేరకు ఎంపిక చేసిన మార్కెట్ యార్డులతో పాటు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆధార్ ఆధారిత ఈ-పంట డేటా ప్రకారం పత్తి రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి, రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనున్నారు. కాపాస్ కిసాన్ యాప్‌తో డేటా అనుసంధానం చేసి, స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. స్లాట్ బుకింగ్ నేపథ్యంలో మండలాల వారీగా పంట దిగుబడి, కోత సమయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. యార్డులు, మిల్లుల్లో పత్తి నిల్వలకు బీమా ఉండాలని నిర్దేశించింది. ప్లాస్టిక్, గన్నీ బ్యాగులను నివారించేందుకు రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించింది. పత్తి రైతుల కుటుంబ సభ్యులను గుర్తించేందుకు రేషన్‌కార్డులోని డేటాను సీఎంయాప్‌కు అనుసంధానం చేయాలని పౌర సరఫరాలశాఖను ఆదేశించింది. రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్‌కు సీసీఐ నగదు చెల్లింపులు జరపాలని నిర్దేశించింది. పత్తి అమ్మకం కోసం వివరాల నమోదు సమయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం ఫొటో కాపీలను రైతులు తీసుకు రావాలని స్పష్టం చేసింది. సాగు విస్తీర్ణం, దిగుబడి, పత్తితీతల మేరకు మండలాల వారీగా అమ్మకానికి రైతులను అనుమతించనున్నారు. పత్తి నాణ్యతాప్రమాణాలను రైతులకు వివరించాలని, అగ్ని నిరోధక, తేమ శాతం గుర్తింపు పరికరాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూనికలు, సీసీ కెమేరాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమేరాల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఐకి సూచించింది. పత్తి రవాణా వివరాలూ యాప్‌లో నమోదు చేసి, రవాణాదారులకు చెల్లింపులు జరపాలని పేర్కొంది. జిల్లా స్థాయిలో పత్తి కొనుగోలు కార్యకలాపాల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు సమస్యలపై నేడు సీఎంకు షర్మిల వినతిపత్రం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో 'రైతన్నకు అండగా కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతల ఆక్రందనలపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ నేతలతో చర్చించాక .. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళతామని తెలిపారు.

వరద జలాలపై మాకే సంపూర్ణ హక్కులు

- కృష్ణా ట్రైబ్యునల్ ముందు ఏపీ స్పష్టీకరణ
- వచ్చే నెల 29, 30, 31 తేదీల్లో కొనసాగనున్న వాదనలు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాల వివాద ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలతో పాటు వరద జలాలపైనా దిగువ రాష్ట్రంగా తమకే సంపూర్ణ హక్కులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు ప్రారంభించారు. ఎగువన ఉన్న తెలంగాణ నుంచి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చేశాక.. వాటిపై పూర్తి హక్కు తమకే ఉంటుందన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులూ ఉండబోవని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో తెలంగాణ వాదనలు వినిపించగా.. గురువారం ఏపీ వాదనలు ప్రారంభమయ్యాయి. తదుపరి విచారణ వచ్చే నెలాఖరుకు వాయిదాపడింది. అక్టోబరు 29, 30, 31 తేదీల్లో ఏపీ వాదనలు కొనసాగుతాయని ట్రిబ్యునల్ పేర్కొంది. కాగా.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో తమకు 70% వాటా ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.



ముగిసిన 'జల ప్రహార్' విన్యాసాలు

భారత ఆర్మీతో కలిసి నౌకాదళం ఏడాదికి రెండుసార్లు నిర్వహించే 'జల ప్రహార్' విన్యాసాలు విశాఖలో బుధవారం ముగిశాయి. వీటిని సముద్రంలోను, తీర ప్రాంతంలోనూ నిర్వహించారు. ఇందులో ఐఎన్ఎస్ ఘరియల్ పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఇక 'రెవెన్యూ' కష్టాలకు చెల్లు!

- వచ్చే నెలంతా ప్రణాళికా శాఖ ఇంటింటి సర్వే
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిక్షిప్తం
- నవంబరు నుంచి ఆర్టీజీఎస్‌కు అందజేత
- వాట్సాప్ గవర్నెన్స్ నుంచి ప్రజలు నేరుగా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ, నివాస, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోందని.. ప్రతి వారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్‌కు లంచం ఇస్తేనే పని చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాట్సాప్ గవర్నెన్స్ అమల్లోకి వచ్చాక మండల తహసీల్దారు కార్యాలయాలకు లబ్ధిదారులు, దరఖాస్తుదారులను రప్పించవద్దంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా కూడా రెవెన్యూ శాఖలో మార్పు రాలేదు. వారాంతపు సమీక్షా వివరాలను ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కుటుంబానికి సంబంధించిన సమస్త సమాచారం ఆర్టీజీఎస్ వద్ద ఉన్నందున వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా పుట్టుకతో వచ్చిన కులం మధ్యలో మారిపోదు కదా అని సీఎం పేర్కొన్నారు. ఆదాయానికీ ఇదే విధానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పత్రాలను నేరుగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి మౌఖికంగా సర్వే నిర్వహించిన ప్రణాళికా శాఖ అక్టోబరులో మరోసారి సర్వేకు సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు ఇంటింటి సర్వే చేసి ప్రధానమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను నిక్షిప్తం చేయనుంది. నవంబరు నుంచి వాటిని ఆర్టీజీఎస్‌కు అందజేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డేటాను క్రోడీకరించుకుని వారికి అవసరమైనప్పుడు ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని వాట్సాప్ గవర్నెన్స్ కల్పిస్తుందని 'ఆంధ్రజ్యోతి'కి కాటంనేని భాస్కర్ వివరించారు.

వేలకోట్లు వెచ్చిస్తున్నా ఉద్దేశం నెరవేరట్లేదు!

- కేజీబీవీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- అర్హులైన బోధన సిబ్బంది లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్న
- 14న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి ఆదేశం
- రాష్ట్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి కూడా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 ఏళ్లుగా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కేజీబీవీల ఏర్పాటు ఉద్దేశం నెరవేరట్లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన కేజీబీవీలలో శాశ్వత ప్రాతిపదికన అర్హులైన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, అణగారినవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2004లో ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాలసీలో శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం గురించి ప్రస్తావించారని, మరోవైపు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారని పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడంలేదంది. ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని తెలిపింది. తగినన్ని అవకాశాలు ఇచ్చినప్పటికీ సరైన వివరాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంది. వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శిని, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. విచారణను వచ్చేనెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు) 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాలలో నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదిస్తూ.. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియామించుకొనే వెసులుబాటు కేంద్రం రూపొందించిన పాలసీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ...బోధన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి సూచనలు చేసిందన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో నడిచే విద్యాసంస్థలకు అయ్యే ఖర్చులో 60 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, కేంద్రం చెప్పినట్లు నడుచుకోకుంటే ఆ సొమ్మును విడుదల చేయరని తెలిపారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా



మలయాళ దర్శకుడు డాక్టర్ ప్రగబల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జాకీ'. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమకృష్ణ దాస్, సీ ప్రేమదాస్ నిర్మిస్తున్నారు. మధురైలో సంప్రదాయంగా కొనసాగుతున్న పొట్టేలు పందేల చుట్టూ సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రబృందం గురువారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రగబల్ మాట్లాడుతూ 'ఆసక్తికరమైన కథాంశంతో 'జాకీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. పొట్టేలు పందేలు, పాత్రల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. రియల్ లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తి బాలాజీ, సినిమాటోగ్రఫీ: ఉదయ్ కుమార్.

పవన్‌తో సినిమా ఆనందంగా ఉంది

- సుజీత్



'దాదాపు మూడేళ్ల ప్రయాణం. మొదటి రోజు నుంచి మమ్మల్ని సపోర్ట్ చేస్తూ, మా పక్కనే ఉంటూ మాకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసిన నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ గారికి కృతజ్ఞతలు. అలాగే 'ఓజీ' కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. నేను ఆయన వీరాభిమానిని. 'జానీ' సినిమా సమయం నుంచి పవన్‌గారిని కలిస్తే చాలు అనుకునేవాడిని. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు దర్శకుడు సుజీత్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'ఓజీ' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమైంది, విజయం సాధించిన తర్వాత భయం, బాధ్యత పెరిగాయి. 'ఓజీ' సినిమా మాది కాదు. దీన్ని ప్రేక్షకులు తమదిగా భావిస్తున్నారు. ఎక్కడ చూసినా 'ఓజీ' సందడే కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ గారికి ఉండే పవర్ అది. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, ఓజీ' ఇలా వరుసగా పవన్ కల్యాణ్ గారి సినిమాలకు పనిచేసే అవకాశం రావడం చిన్న విషయం కాదు' అని అన్నారు. డీవీవీ దానయ్య మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ గారి అభిమానులకు నచ్చే సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎంతో శ్రద్ధతో ఈ సినిమా చేశాం. తమన్, నవీన్ నూలి, రవి చంద్రన్ ముగ్గురూ ఈ సినిమాకు మూడు స్తంభాల్లాంటి వారు. అభిమానుల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

ఏఐతో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు

- ఢిల్లీ హైకోర్టులో నాగార్జున పిటిషన్
- వ్యక్తిగత హక్కులను కాపాడుతామన్న న్యాయస్థానం



కొన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాయని, పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ అక్కినేని నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఆ పిటిషన్ జస్టిస్ తేజస్ కరియా సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నాగార్జున తరఫున న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 14 యూఆర్ఎస్ (యూనిఫాం రిసోర్స్ లొకేటర్)లు కోర్టుకు సమర్పించారు. జస్టిస్ కరియా స్పందిస్తూ... 'మీ దగ్గర యూఆర్ఎల్ ఉన్నాయి కదా? ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు కదా?' అని ప్రశ్నించారు. తామిచ్చే ఆదేశాలతో ఎంత కాలం ఇలాంటివి ఆపగలమని వ్యాఖ్యానించారు. అలాగని, తామేమీ చూస్తూ ఊరుకోమని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఇంటర్నెట్‌లో భాగమైన తర్వాత పెద్ద సమస్యగా తయారైందని వ్యాఖ్యానించారు. నాగార్జున వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చూస్తామన్నారు. తక్షణమే ఆ లింకులను తొలగించాలని ఆయా యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.

-న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

జటాధర తొలి గీతం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓం నమఃశివాయ్..' అంటే సాగే తొలి పాట సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేశారు. కాగా, ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.


ఆసక్తిగా 'గోదారి గట్టుపైన'



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా యూనిట్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. 'మనుషులు కూడా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా' అని సుమంత్ ప్రభాస్ పలికే సంభాషణలు ఆసక్తిగా ఉన్నాయి. కాగా, నిధి ప్రదీప్ ఈ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అవుతున్నారు.

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,38 360 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కుల కన్నా తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 5722, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు. దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పులిచింతలకు 2,62,741 క్యూసెక్కులు

రెంటచింతల,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ గేట్లకు 12 గేట్లను 4 మీటర్లు, ఒక గేట్‌ను రెండు మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,62,741 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 2,61,450 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.99 మీటర్ల మేర నీరుండగా.. 6.890 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తి జరగడం లేదని తెలిపారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. ఇది 303.94 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9019, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, 22 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,28,024, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 2,73,116 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,73,116 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు ఈ-లాటరీ

తుళ్లూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోత): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన మరికొందరు రైతులకు సీఆర్డీఏ రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనుంది. పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం గ్రామ రైతులకు (ప్రత్యామ్నాయ ప్లాట్లు) శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటరులోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ జరగనుంది. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 43 రెసిడెన్షియల్, 41 కమర్షియల్, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. సంబంధిత రైతులు పాల్గొనాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రతి ఒక్కరూ ఎంతగానో సహకరించారు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా


హెనీక్రిస్టీనాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సహకారంతో సమర్థంగా పరిపాలన అందిస్తున్నానని.. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పేర్కొన్నారు. ఆమె పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి ఉద్యోగులు తమవంతు సహకారాన్ని అందించారని హెనీక్రిస్టీనా తెలిపారు. పరిపాలన అధికారి రాజా రత్నబాబు, అకౌంట్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్, రామకోటయ్య, తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్ రావు, జిల్లా పరిషత్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ రిప్రజెంటేటివ్ తోట ఉషాదేవి, అరుణ తదితరులు చైర్‌పరన్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి వచ్చింది.

'రెడ్' హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు..!

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నిర్ధారించేందుకు కిట్‌లో రెండు కెమికల్స్ ఉంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యపు గింజలపై కెమికల్ చుక్కలు వేయగానే అవి ఎరుపు రంగులోకి మారుతాయి. ఎందుకంటే ఈ ఫోర్టిఫైడ్ గింజల్లో విటమిన్లు కలిసి ఉండటమే. ఇలా రేషన్ బియ్యాన్ని ఇక నుంచి నిర్ధారించవచ్చు. చిన్న బియ్యం ఆకారపు గింజలను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు. ఈ బియ్యం పంపిణీ అమల్లోకి వచ్చిన కొత్తలో చైనా బియ్యం, ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రజలు అపోహలకు గురయ్యారు. ఈ బియ్యపు గింజలు.. నీటిలో తేలాడుతాయని, అందువల్లే వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు భావించారు. ఈ అపోహలను పౌరసరఫరాల శాఖ నివృత్తి చేసింది.

నియోజకవర్గానికి ఒక కిట్..

ప్రతి జిల్లాకు ఈ కిట్లు సరఫరా అయ్యాయి. ఒక కిట్ జిల్లా సరఫరా అధికారి వద్ద ఉంటుంది. పౌర సరఫరాల టీటీలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేశారు. కిట్ల సంఖ్య ఇంకా పెరగనుంది. మొత్తం మీద చౌక బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

ఒక్క చాన్స్ అడిగారు... నెత్తిన కుంపటి పెట్టారు

● శాంతి భద్రతలు, సోషల్ మీడియా విషప్రచారంపై కఠినంగా ఉండాలి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే ఎవరిపైన అయినా కఠినంగా వ్యవహరిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు కోరారు. గురువారం అసెంబ్లీలో శాంతిభద్రతల అంశంపై ఆయన ప్రస్తావిస్తూ.. 2019లో ఒక్క చాన్స్ అడిగారని, ఇస్తే రాష్ట్ర ప్రజల నెత్తిన కుంపటి పెట్టి పోయారన్నారు. వైసీపీకి అవకాశం ఇస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్టేనని ఆనాడు సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 16 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాజధాని పర్యటనకు వస్తే చెప్పులు వేశారని, దీనిపై ఆనాటి డీజీపీ వ్యాఖ్యలు చూస్తే భావ ప్రకటన స్వేచ్ఛ అన్నారన్నారు. అలా చేయడం తమకు చేతకాక కాదని, క్రమ శిక్షణ కలిగిన పార్టీలో పనిచేస్తున్న తామంతా.. అలా చేయకూడదన్న ము ఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో ఓపిగ్గా ఉన్నామని యరపతినేని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ మహిళలను గౌరవిస్తూ.. ఎన్నో పథకాలకు మహిళల పేర్లతో ఇస్తున్నామని దీంతో మహి ళల్లో ప్రజాదరణ వచ్చిందన్నారు. మంచి ఆలోచనలు వైసీపీ నాయకులకు లేవన్నారు. సభలో చంద్రబాబు లాంటి మచ్చలేని నాయకులపై, రాజధాని మహిళలు, రైతులపై అసత్య ప్రచారాలు చేయడంతోపాటు అనేక ప్రాంతాల్లో అత్యా చారాలకు పాల్పడిన వైసీపీ నేతలు.. నేడు మహిళల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం అనేకన్నా.. పైశాచిక ప్రభు త్వం అంటే బాగుంటుందేమో నని యరపతి నేని అభిప్రాయపడ్డారు. వైసీపీ నేతలు కొందరు ఇప్పటికీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారానికి పాల్పడుతూ.. మహిళలను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారన్నారు. అలాంటి వారిని తేలికగా తీసుకోవద్దని సభలో యరపతినేని ప్రస్తావించారు. అడ్డగోలుగా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవ హరించాల్సి ఉందన్నారు. జిల్లా అధికారులు కూడా తగిన ఆదేశాలు ఇస్తూ సోషల్ మీడియాలో మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించే విధంగా ఆదేశాలివ్వాల్సి ఉందన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే యరపతినేని సభలో ప్రస్తావించారు.

జీఎస్టీ సంస్కరణలు వినియోగదారులకు అందించాలి

● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్



సదస్సులో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ లంకా దినకర్

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ సంస్కరణలను వినియోగదారులకు అందించడం వ్యాపారుల నైతిక బాధ్యత అని 20 సూత్రాల అమలు కమిటీ చైరన్ లంకా దినకర్ అన్నారు. గురువారం జేకేసీ కళాశాల రోడ్డులోని మీటింగ్ హాల్‌లో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లంకా దినకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడవకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు లాభం చేకూరుతుందో.. లేదో చూడాల్సిన బాధ్యత జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్‌దేనన్నారు. తగ్గిన ధరలకు సంబంధించిన మేలు వినియోగదారులకు అందేవిధంగా విషయ పరిజ్ఞానాన్ని ప్రజలకు చేర్చే ప్రక్రియకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ శ్లాబులు తగ్గించడం వల్ల దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుందన్నారు. ఈ సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జీఎస్‌టీ సూపరింటెండెంట్ నాగేశ్వరావు, చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది రంగరాజు, భీమినేని చంద్రశేఖర్, డాక్టర్ రాధ మాధవి, దర్శనం శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, చార్టెడ్ అకౌంటెంట్స్, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ప్రొఫెసర్లు, ఇంజనీర్స్ తదితరులు పాల్గొన్నారు

సామాజిక అభివృద్ధిపై ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్‌తో కాకినాడలోని యూనివర్సిటీ ఆఫ్ డెమొక్రసీ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జి.అబ్బయ్య, సెక్రటరీ డాక్టర్ ఎ.శ్రీనివాస్, మెంటార్ డాక్టర్ కె. కృష్ణమోహన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సామాజిక బాధ్యతను సమాజంలోకి తీసుకెళ్లే విధంగా రెండు సంస్థలు పనిచేస్తాయన్నారు. ఎంఓయూ ద్వారా సంయుక్తంగా పలు సామాజిక అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు, సిబ్బంది డాక్టర్ వి .శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరి ఫౌండేషన్‌పై చర్యలకు ప్రత్తిపాటి డిమాండ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటకు చెందిన సంస్థ జ్ఞానేశ్వరి ఫౌండేషన్ అక్రమాలపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో ప్రజలకు తెలియజేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అసెంబ్లీలో కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో.. పనులు చేయకుండానే రూ.వందల కోట్ల బిల్లులు తీసుకొని మోసగించిన సంస్థను ఉపేక్షిస్తే.. ప్రజలకు చెడు సంకేతాలు వెళ్తాయని అయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో ఆ సంస్థ చేపట్టిన పనులపై పూర్తి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సంస్థ నిర్వాహకులను కఠినంగా శిక్షిస్తేనే ప్రభుత్వంపై ప్రజల నమ్మకం రెట్టింపు అవుతుందని చెప్పారు.

చీఫ్‌విప్ జీవీకి ప్రత్యేక క్యాబిన్


చీఫ్‌విప్ జీవీని అభినందిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

వినుకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంత్రులు, విప్‌లకు కేటాయించిన నూతన క్యాబిన్‌లను గురువారం స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రారంభించారు. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ విప్ జీవీకి ప్రత్యేకంగా కేటాయించిన క్యాబిన్‌లో మంత్రులు నారాయణ, కేశవ్‌లు ఆయనను అభినందించారు.

తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి జాషువా

● తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్



ప్రసంగిస్తున్న చైర్మన్ ఆర్‌డీ విల్సన్, పాల్గొన్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి గుర్రం జాషువా అని తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు శారదానికేతన్‌లో గురువారం జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షుడు ఎస్.బాలస్వామి అధ్యక్షతన జాషువా జయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథి విల్సన్ మాట్లాడుతూ సాహితి లోకంలో విరాజిల్లిన కవిగా జాషువా వెలుగొందాడని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత వరకు జాషువా కవిత్వం వర్ధిల్లుతుందన్నారు. అనంతరం ప్రముఖ సాహితివేత్తలు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, చిటిపోలు వెంకటరత్నంను జాషువా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పోలే ముత్యం, పీవీ రమణ, బీరం సుందరరావు, డాక్టర్ ఎం.విజయశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరావు, న్యాయవాది రవీంద్రబాబు, మోహనరావు, కె.లెనినా, జె.బాబు రావు, చంద్రపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

● ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం శుభావార్త చెప్పింది. పత్తి పంటను ఇష్టమైన కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వెసులు బాటు కల్పిస్తూ జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు రైతులు పండించిన పత్తిని అదే మండలంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రాయించాల్సి వచ్చేది. దాని వల్ల సరైన ధర దక్కడం లేదని రైతులు ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం గత నిబంధనలను సవరించింది.

కాల్వలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

బాపట్లరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాల్వలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా అతని మృతదేహం గురువారం సూర్యలంక పొగరు వద్ద లభ్యమైంది. బాపట్ల రూరల్ పోలీసులు వివరాల మేరకు.. బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామానికి చెందిన వీరభద్రరావు (62) అనే వ్యక్తి కిరణా కొట్టు నడుపుకుంటూ ఒంటరిగా జీవితం సాగిస్తున్నాడు. మానసికంగా కృంగిపోయిన వీరభద్రరావు మూడు రోజుల క్రితం నాగరాజు కాల్వలో దూకాడు. అతని మృతదేహాన్ని సూర్యలంక పొగుర వద్ద మత్స్యకారులు చూసి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు మృతదేహన్ని తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం


ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పించిన గాయకులు, సేవా సదన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, తెలుగు పాటలకు చిరునామా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సౌజన్యంతో, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపికుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్ సెంటర్, ఐలాండ్ వద్ద ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత కాలం బాలు పాట వినపడుతూనే ఉంటుందన్నారు. గాయకులు యశోదకృష్ణ, వెంకటరత్నం, డేగల వెంకటేశ్వరరావు, ఖాదర్, బాబురావు, ఎన్ కోటేశ్వరరావు, కృపావరం, ఉపేందర్‌సింగ్, సత్తార్, మాతృశ్రీ విద్యా సంస్థల డైరెక్టర్ గాంధీ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుకి ఉచిత శిక్షణ

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో శాప్ ఎస్‌డీలో ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ అక్టోబర్ 25 ప్రారంభమవుతుందని సంస్థ వ్యవస్థాకుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిగ్రీ విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 11వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంపై.. వివరాలకు 99852 22857, 94402 64695 నంబర్లకు సంప్రదించాలన్నారు. లేదా కుంచనపల్లి బైపాస్ రోడ్డు వద్ద డీ మార్ట్ పక్కన ఉన్న రామ్‌స్నేహ అవెన్యూస్ ఫ్లాట్ నంబరు 208లోని సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని సురేష్‌కుమార్ తెలిపారు.

జగన్‌ది దగా.. చంద్రబాబు మెగా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగన్‌మోహన్‌రెడ్డి దగా డీఎస్సీతో నిరుద్యోగుల్ని వంచిస్తే, చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీతో వారి కలలు నిజం చేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం అన్నారు. ఏటా మెగా డీఎస్సీ అమలు చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి దగా డీఎస్సీ అమలు చేశాడన్నారు. రాష్ట్ర యువతను వంచించి, వారి కలలను భగ్నం చేశారని మండిపడ్డారు. సీపీఎస్, పీఆర్సీ అమలుపై తనను ప్రశ్నించారన్న అక్కసుతో జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులపై కక్షగట్టి వారితో చేయకూడని పనులు చేయించారన్నారు. తనకు వ్యతిరేకంగా పనిచేస్తారన్న దురుద్దేశంతో చివరకు ఎన్నికల విధుల నుంచి తప్పించడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. టీడీపీ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే టీడీపీ అని మరోసారి నిరూపితం అయిందన్నారు. 2014-19లో 18 వేల పోస్టులతో డీఎస్సీ అమలు చేస్తే.. నేడు 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీకి కూటమి కార్యరూపమిచ్చిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పట్టుదల, పక్కా ప్రణాలికతో వైసీపీ ప్రభుత్వానికి సాధ్యంకాని మెగా డీఎస్సీ అమలు ఆచరణ సాధ్యమైందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

32,470 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 30,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,470 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,696 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	14400
273	10500	13500	నెంబరు. 5	10000	14200
341	10000	15000	273	----	----
4884	----	----	341	10000	15200
సూపర్ 10	----	----	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14700
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	14800	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

మెప్మా పనితీరు మెరుగుపర్చాలి

● పీడీ ఆనందపాల్


మాట్లాడుతున్న మెప్మా పీడీ ఆనందపాల్, కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెప్మా పనితీరు మెరుగు పరిచి డిజిటల్ లక్ష్మీ రిజిస్ట్రేషన్లు మొత్తం పూర్తి చేయాలని పీడీ ఆనంద్‌పాల్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల పట్టణంలో మొత్తం 65 ఎస్ఎల్ఎఫ్‌లు ఉండగా అందులో 49 మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వాటిల్లో 18కి లాగిన్ వచ్చాయన్నారు. సీఎం స్వానిధిని లోక కల్యాణం 2.0గా మార్చడం జరిగిందన్నారు. టెర్రస్ గార్డెన్స్‌కు సంబంధించి పట్టణంలో మూడు ఎస్ఎల్ఎఫ్‌లు బెస్ట్‌గా నిలిచాయని సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, మెప్మా ఐబీ ఇంద్రసాల్, సీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మునిసిపల్ కమిషనర్

రేపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడవేయకుండా ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించే మునిసిపల్ వర్కర్లకు అందజేసి పరిశుభ్రతను కాపాడాలని మునిసిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏక్ దిన్ ఏక్‌గంట ఏక్‌సాక్ శ్రమదానం కార్యక్రమంలో భాగంగా వినాయకుని గుడి, పోలీసు క్వార్టర్స్ వద్ద ఉన్న చెత్తపాయింట్లను మునిసిపల్ అధికారులు శుభ్రం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా గృహాల వద్ద పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆదర్శ వేదిక అధ్యక్షుడు వై.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఎస్టీ గ్రీవెన్స్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి నెల 4వ శుక్రవారం ప్రత్యేక ఎస్టీ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని గ్రామాల గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైక్రోఫైనాన్స్ ఉద్యోగుల మోసంపై కేసు

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం తాలూకా డబ్బులు చెల్లిస్తున్నప్పటికి రశీదులివ్వకుండా మోసం చేస్తున్నారంటూ మైక్రోఫైనాన్స్ ఉద్యోగులపై ఓ మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన తాడిశెట్టి లక్ష్మీ తిరుపతమ్మ తీసుకున్న రుణంను వాయిదాను సిబ్బందికి రూ.20,200 చొప్పున 11 నెలలుగా చెల్లించగా కంపెనీలో జమచేయలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో కలుపు మందు పిచికారి

అమృతలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమృతలూరు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెరువులో కలుపుమందు పిచికారీ చేశారు. గ్రామస్థుడు గొట్టిపాటి గంగాధర్ తన సొంత ఖర్చులతో చెరువులో కలుపు మందును డ్రోన్ ద్వారా పిచికారి చేయించారు.

డీఎస్సీ ఉత్సవంలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. విజేతలైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. 1994 నుంచి 2025 వరకు 14 డీఎస్సీలు నిర్వహించి 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనన్నారు.

కర్లపాలెంలో స్వచ్ఛతా హీ సేవ

కర్లపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం పంచాయతీలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యాలయం నుంచి బోర్డు స్కూల్ వరకు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరావు, డిప్యూటీ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, కార్యదర్శి సునీత, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు మోటార్ సైకిల్ మెకానిజంపై శిక్షణ

వేమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపని బీఎం ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ కోర్సుకు సంబంధించి విద్యార్థులకు ద్విచక్ర వాహనాల పనితీరు రిపేర్లపై గురువారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆటోమొబైల్ ట్రేడ్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భవిష్యత్తులో జీవనోపాధి ఉపయోగపడే విధంగా ఈ శిక్షణను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బదరీ నారాయణ తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ శిక్షణను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి: మజుందార్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27, 28వ తేదీలలో జరగబోయే సీఐటీయూ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 27న రేపల్లె ఆర్టీసి బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించి నెహ్రూ బొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. అన్ని ప్రాంతాలు నుంచి ప్రజానీకం పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

చిరుధాన్యాలతో మెరుగైన జీవనశైలి: సీడీపీవో లక్ష్మీదేవి

అమృతలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో మెరుగైన జీవనశైలి, ఆరోగ్యకరమైన జీవితం ఉంటుందని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఏ. లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గోవాడ పోషణ మాసోత్సవాల్లో సీడీపీవో చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గర్భవతులకు సీమంతం నిర్వహించారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో డంపింగ్‌యార్డు వద్ద నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలకు గురువారం జేఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ ఆహార ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఏరియా వైద్యశాల, ఆర్‌వోబీ పక్కనే ఉంటున్న వారికి కూడా భోజన ప్యాకెట్‌లు అందజేశారు. జేఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ యూత్ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కటికల ఆనంద్‌బాబు, కట్టా విజయరాజు, దాసరి ఏసుబాబు, కె.సుజాత, కె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె




జంపని రామేశ్వరాలయంలో చాముండేశ్వరిగా, చావలి వాలేశ్వరాలయంలో కాళికగా, అబ్బునగూడవల్లి శివాలయంలో కాత్యాయని దేవిగా, కొల్లూరులో సత్యజ్ఞానప్రసూనాంబగా లలిత త్రిపురసుందరి దేవి, గాయత్రిదేవిగా పార్వతి అమ్మవారు, అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవీ అమ్మవారు, కర్లపాలెం వీరభద్రస్వామి ఆలయంలో కాత్యాయని రూపంలో అమ్మవారు

కన్నుల పండువగా దసరా మహోత్సవాలు

జిల్లాలోని పలు మండలాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు కాత్యాయని, చాముండేశ్వరి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేస్తున్నారు. సాయంత్రం ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్





ఆదిశేషు యోగశక్తి పీఠంలో శ్రీకాత్యాయనిగా అమ్మవారు

రేపల్లె: చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో కాత్యాయనిదేవిగా, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవిగా, రామకోటిపేట శివాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారిగా అలంకారం, నృసింహ వారాహి అలంకరణలో శ్రీబగళాముఖి, ఉల్లిపాలెంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



స్వచ్ఛతా హీ సేవలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వచ్ఛతాహీ కార్యక్రమాలు జిల్లాలో విడివిడిగా జరపాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మాదిరిగా అక్టోబరు 2వ తేది వరకు పారిశుధ్య కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించాలని, విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. మునిసిపల్, పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమాలపై ఎంపీడీవోలకు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు మంజూరైన మరుగుదొడ్లు వేగంగా నిర్మించాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువును అభివృద్ధి చేయాలన్నారు. పద్ధతి ప్రకారం వాటిని విక్రయించేలా కృషిచేయాలన్నారు. మున్సిపాలిటి కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని, మురికి తొలిగించాలని, తాగునీటి చెరువులు క్లోరినేషన్ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్పీ ఉమామహేశ్వర్



చెరుకుపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

చెరుకుపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే అర్జీదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా నూతన ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. బుధవారం రేపల్లె రూరల్ సర్కిల్ పరిధిలోని చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, ఎస్‌హెచ్‌వో, రిటైర్, కంప్యూటర్, రికార్డులను భద్రపరిచే గదులు, మహిళా హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వారు నిర్వహిస్తున్న విధులు, స్టేషన్ పరిధిలో పరిస్థితులు, నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. మద్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో సేవించినా ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, రేపల్లె రూరల్ సీఐ పి.సురేష్ బాబు, చెరుకుపల్లి ఎస్ఐ టి.అనిల్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

వెదుళ్ళపల్లిలో...

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. వెదుళ్ళపల్లి, నీసీఎస్ పోలీసుస్టేషన్‌లను, పోలీసు డాగ్‌స్క్వాడ్ భవాన్ని, స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకును ఎస్పీ గురువారం పరిశీలించారు. పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసు డాగ్ స్క్వాడ్ భవనంలోని డాగ్‌కెన్నల్స్‌ను, జాగిలాలకు ఇచ్చే ఆహారాన్ని, వాటి శిక్షణ, తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సర్కిల్ సీఐ బి.హరికృష్ణ, వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.భాగ్యరాజు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల సూచనల నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటయ్యే ఈ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని తెలిపారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది స్థానిక పోలీసు అధికారులతో, కృష్ణా బ్యారేజి నిర్వాహకులతో, రెవెన్యూ విభాగం అధికారులతో, వాతావరణశాఖ ప్రతినిధులతో అనుసంధానంగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ఉన్నతాధికారులకు తెలియజేస్తారని చెప్పారు. అలాగే ఎప్పటికప్పుడు స్థానికంగా విధులలో ఉన్న సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేస్తుంటారని తెలిపారు. ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసు వారి సూచనలు పాటించాలని ఎస్పీ సూచించారు.

పండిట్ దీన్‌దయాళ్ సేవలు స్ఫూర్తిదాయకం

● రోజ్ ఎన్జీవో కార్యదర్శి పొందుగల ప్రసాదరావు

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఉన్నతికై పాటుపడిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు స్ఫూర్తిదాయకమని రోజ్ ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి పొందుగల ప్రసాదరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహరాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మేరా యువభారత్, గుంటూరురోజ్ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీపీఎస్ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ జరిగిన సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ, భారతీయ ఆలోచనలకు పండిట్ దీన్‌దయాళ్ ప్రముఖ స్తంభమని అన్నారు. ఆయన పేదలు కోసం పనిచేసిన ప్రసిద్ధ తత్వవేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.పురుషోత్తమరావు, డీసీపీవో కె.దీవెన, పి.శైలజ, పి.అగస్టిన్, ఎం.వినోద్‌కుమార్, సయ్యద్ అబ్దుల్ కరీం, జి.రోస్లిన్, వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విన్నకోట సురేష్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశ్‌రావు, తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి తదితర నాయకులు

ఘనంగా జనసేన నాయకుడు సురేష్ జన్మదినం

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో గౌరవాధ్యక్షుడు జీవీఎల్ మోహన్‌గౌడ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశ్‌రావు, తూర్పుసత్రం చైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంటా రాములు, శ్రీను, గోపాళం లక్ష్మీ నారాయణ, గిద్దె శ్రీను, బండిమూర్తి, బందర్ రవి, కారుమూరి అంజనేష్, దాసరి వినోద్‌కృష్ణ, వడ్రాణం బ్రహ్మం, అల్లం గోపీకృష్ణ, అంకిరెడ్డి అనూష్‌కుమార్, పెద్దినాగు, రఘు, పసుపులేటి సాంబయ్య, పేరలి కృష్ణ, కె.నరేంద్ర, వెంకట్రావు, దుర్గాప్రసాద్, గోపి, మదన్‌కుమార్, శ్రీనివాసరావు, వంగపాటి శివ, పి.బాలకృష్ణ, గొర్ల ఆంజనేయులు, చేజర్ల సతీష్, రామకృష్ణ, మర్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను శుభ్రం చేసిన ఎంపీడీవో రామకృష్ణ



ఈస్ట్ బాపట్ల నందిరాజుతోటలో రోడ్లను శుభ్రం చేస్తున్న బాపట్ల ఎంపీడీవో రామకృష్ణ

బాపట్ల రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎంపీడీవో జి.రామకృష్ణ చీపురు చేతపట్టి రోడ్లను శుభ్రం చేశారు. బాపట్ల మండలం నందిరాజుతోటలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద చెత్తను తొలగించి ఆ ప్రదేశంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తూర్పు బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● తూనికలు, కొలతలశాఖ మూడు జిల్లాల అధికారి ఐజాక్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతలశాఖ మూడు జిల్లాల అధికారి ఐజాక్ దుకాణదారులను హెచ్చరించారు. బాపట్ల పట్టణంలో గురువారం జీఎస్టీ 2.0పై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. తూనికలు, కొలతలశాఖ జిల్లా అధికారి లిల్లీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐజాక్ మాట్లాడుతూ, 18 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులను 5 శాతానికి తగ్గించి విక్రయించాలన్నారు. ప్రభుత్వం జీఎస్టీ 2.0 తెచ్చిన సందర్భంగా అన్ని రకాల వస్తువులపై దీనిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రామదాసు, బాపట్ల రిటైల్ కిరణా, జనరల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గొరికపూడిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొరికపూడిలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వెల్లటూరు పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యాధికారులు నిర్వహించారు. ఈ ఉచిత చికిత్సా కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లికా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు అబ్రహం లింకన్ మాట్లాడుతూ, తల్లిపాలతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యకరమైన జీవనం సాగిస్తుందని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యమన్నారు. వైద్యాన్ని పల్లెలకు చేరువ చేసి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు నళిని, కృష్ణకుమారి, భూదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది స్వాతి, నగరాజకుమారి, మాధవి, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

డ్రైయిన్లు శుభ్రం చేసి, పిచ్చి మొక్కలు తొలగించండి

● కమిషనర్ రఘునాథరెడ్డి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాం పేట, నరాలశెట్టివారి పాలెం ప్రాంతాలలో గురువారం కమిషనర్ జి.రఘునాథ రెడ్డి సిబ్బంది, నాయకులతో కలిసి పర్యటించారు. ఖాళీ స్థలాలలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ళచెట్లను పరిశీలించి వాటిని తొలగించాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. డ్రైయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గృహ సముదాయాల మధ్యన ఉన్న మొక్కలను తొలగించి శుభ్రం చేయాలన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, టీడీపీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మౌనిక, డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్యకేంద్రం సిబ్బంది కార్మికులకు వైద్య సేవలందించారు.



కబడ్డీ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు ఐదుగురి ఎంపిక

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్‌కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలోని కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. పోటీలలో 21 కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కళాశాలల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులను ప్రోత్సహించటలో ఎడ్యుకేషన్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఉపాధ్యక్షుడు పారేపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ దొడ్డపనేని వెంకయ్యచౌదరి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ, 21 కళాశాలల నుంచి క్రీడాకారులు కబడ్డీ పోటీలలో పాల్గొనగా 14 మంది క్రీడాకారులలో ఇద్దరు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, ముగ్గురు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.మల్లికార్జునరావు, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అబ్దుల్‌కలాం ఫౌండేషన్ చైర్మన్ రాజేశ్ తదితరులు

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసింహవర్మ, ఆదంషఫి తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత చలనచిత్ర సంగీత జగత్తులో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఒక ధ్రువతారని, గాన గంధర్వుడని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ కొనియాడారు. బాలసుబ్రహ్మణ్యం 11 భాషలలో 40 వేల పాటలు పాడి, తన గాత్ర మాధుర్యాన్ని ప్రేక్షకులకు అందించారని అన్నారు. గురువారం బాపట్ల సాహితి భారతి ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాహితి భారతి కోశాధికారి ఆదం షఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, డాక్టర్ శ్రీనివాస్, దగ్గుమల్లి శామ్యూల్, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్ తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులు అర్పించారు.

● బాపట్ల: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ రాజేష్ పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 5వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాజేష్, నక్కా ప్రకాశ్, గవిని ప్రసాద్, కర్నేటి ఏడుకొండలు, నర్రా కొండలు, అనీల్, దయారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేరలిలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్

కర్లపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో డాక్టర్ బాలకృష్ణమూర్తి కాంప్లెక్స్‌లో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హెల్ప్ హాస్పిటల్ విజయవాడ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ నాగకిరణ్ రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌బాష, చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు ఎం.బుల్లియ్య, బహదూర్‌బాష, హెల్ప్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

గణపవరంలో నిత్యావసరాల పంపిణీ

కర్లపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేశ్ జన్మదిన సందర్భంగా గురువారం కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి, తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసికుమారి, కర్లపాలెం మండలాధ్యక్షుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల మండలాధ్యక్షుడు దాసరి ఏసుబాబు, టీడీపీ కర్లపాలెం మండల మహిళ అధ్యక్షురాలు ఇనగంటి సునీత, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నంబూరి ఏడుకొండలు, బాపట్ల జనసేన పార్టీ నాయకుడు కారుమూరి అంజనేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పేద విద్యార్థుల ఎదుగుదలకు సహకరిస్తాం



దాట్లరాజును సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు తమ చదువులు కొనసాగించి ఉన్నతంగా ఎదిగేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానని రెకోమాక్స్ కాంట్రాక్ట్ కంపెనీ డైరక్టర్ దాట్లరాజు అన్నారు. పంగులూరులో గురువారం మండల విశ్వబ్రాహ్మణసంఘం నిర్వహించిన జాతీయసేవాదినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకటాపురం ఆచారి, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, పామర్తి శ్రీనివాసులు, బాబూజి, శ్రీనావాసాచార్యులు, ఓంకారశర్మ, కోటపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటరమణకు సత్కారం

అద్దంకిటౌన్ : సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా ఏల్చూరి వెంకటరమణను ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వెంకటరమణ దంపతులు సంఘ సభ్యులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళగడ్డ వీరసుందరాచారి, పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యాయుడు కొండమూడి రమేష్, జిల్లా కార్యదర్శి గుండెమెడ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చంద్రమౌళీయం' పుస్తక ఆవిష్కరణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 27న విద్వాన్ జ్యోతిచంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం వజ్రోత్సవ సంచిక ఆవిష్కరించనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యూ.దేవపాలన తెలిపారు. గురువారం జానపద కళాపీఠం సభ్యులు సంచిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులుతో పాటు విశిష్ట అతిథులుగా మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు విస్తాలి శంకరరావు, ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. వెంకటేశ్వరరెడ్డిలు హాజరవుతారన్నారు.

ప్రధానకూడలి వైపుగా బస్సును నడపాలి

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నుంచి బూదవాడ వైపుగా ఇంకొల్లుకు నడిచే ఆర్టీసీ సర్వీస్ పంగులూరు ప్రధాన కూడలి వైపుగా నడిచేవిధంగా చర్యలు చేపట్టాలని పంగులూరు పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు. బూదవాడ ఉన్నత పాఠశాలకు చేరుకునే పాఠశాల విద్యార్థులతో పాటు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అద్దంకి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు బాపట్లకు చెందిన సురేంద్రనాథ్, నాగరాజులు స్కూటీపై అద్దంకిలో బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం తిరిగి వెళుతుండగా రాజీవ్‌కాలనీ సమీపంలో నామ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సురేంద్రనాథ్, నాగరాజులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అద్దంకి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో వెళ్తున్న కారును ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచి బయటకు వస్తున్న బస్సు ఢీ కొట్టింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు కారు వెళుతోంది. గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ లో నుండి నామ్ రోడ్డు లోకి వస్తున్న ఇంకొల్లు బస్ పక్క నుంచి ఢీ కొట్టింది. దీంతో వెంటనే బస్ కూడా ఆగడంతో ప్రమాదం తప్పి పోయింది. కారులో చిన్నపిల్లలతో పాటు కుటుంబసభ్యులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు, రేపు ఏఎస్ఆర్ శిక్షణ తరగతులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేడు, రేపు వేటపాలెం మండల కార్యాలయంలో ఓఆర్ఎస్(ఓన్ సర్వీసెస్ రెవెన్యూ)పై శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు ఎంపీడీవో రాజేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో అన్ని పంచాయతీల సెక్రటరీలు, గ్రేడ్-5 కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ వారి ఆధార్ కార్డు జిరాక్సుతో సహా శిక్షణకు హాజరుకావాలని చెప్పారు.

ప్రజల వైద్య సేవలపట్ల నిర్లక్ష్యం తగదు

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే వైద్యసేవల్లో నిర్లక్ష్యం ఉండరాదని మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు చెప్పారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పాపరాజుతోట అర్బన్ హెల్త్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరుగుతున్న మెడికల్ క్యాంపుకు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూల్లో ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఏఈ గీత, ఇంజనీరింగ్ ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి వచ్చింది.

'రెడ్' హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు..!

ఫోర్టిఫైడ్ బియ్యంను నిర్ధారించేందుకు కిట్‌లో రెండు కెమికల్స్ ఉంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యపు గింజలపై కెమికల్ చుక్కలు వేయగానే అవి ఎరుపు రంగులోకి మారుతాయి. ఎందుకంటే ఈ ఫోర్టిఫైడ్ గింజల్లో విట మిన్లు కలిసి ఉండటమే. ఇలా రేషన్ బియ్యాన్ని ఇక నుంచి నిర్ధారించవచ్చు. చిన్న బియ్యం ఆకారపు గింజ లను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు. ఈ బియ్యం పంపిణీ అమల్లోకి వచ్చిన కొత్తలో చైనా బియ్యం, ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రజలు అపోహలకు గురయ్యారు. ఈ బియ్యపు గింజలు.. నీటిలో తేలాడుతాయని, అందువల్లే వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు భావించారు. ఈ అపోహలను పౌరసరఫరాల శాఖ నివృత్తి చేసింది.

నియోజకవర్గానికి ఒక కిట్..

ప్రతి జిల్లాకు ఈ కిట్లు సరఫరా అయ్యాయి. ఒక కిట్ జిల్లా సరఫరా అధికారి వద్ద ఉంటుంది. పౌర సరఫరాల టీటీలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేశారు. కిట్ల సంఖ్య ఇంకా పెరగనుంది. మొత్తం మీద చౌక బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

కాత్యాయనీదేవిగా జగన్మాత

● చీరాలలో రూ.2 లక్షల నగదుతో విశేష అలంకరణ
● అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని కాత్యాయినీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. కాత్యాయినీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్నభక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గురువారం కాత్యాయిణీదేవి అవతారంలో దర్శనమిచ్చిన తొమ్మవారికి ముందుగా గణపతిపూజ, నవావర్ణపూజ, కలశ స్థాపనగావించారు. స్వామివారికి అభిషేకము, సూక్తహోములు నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్రార్థనము, శ్రీలలితసహస్రనామము, కుంకుమార్చనపూజ శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మండలంలోని ముప్పవరం, రేణంగివరం, కొండమూరు, రామకూరు గ్రామాలతోపాటు పంగులూరు, చందలూరు, నూజెళ్లపల్లె పరిసర గ్రామాలలో శ్రీదేవీశరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో ఉన్న దేవాలయాలలో దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నక్కబొక్కల పాడు, కొత్తపాలెం గ్రామాలలో ఉన్న పోలేరమ్మ తల్లి దేవాలయాలలో నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజ కార్యక్రమాలలో పాల్గొంటు ప్రత్యేక భజనలు నిర్వహిస్తున్నారు. అలానే అంబడిపూడి శివాలయం, కొప్పెరపాడు బొడ్డు రాయి సెంటర్, వేమవరం ఎస్టీ కాలనీలలో దసరా నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా రాత్రి 12 గంటల వరకు భజనలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. రోజుకు ఒక రకమైన అలంకరణలతో దుర్గాదేవిని ముస్తాబు చేస్తున్నారు. అద్దంకి :దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో బాగంగా అద్దంకి పట్టణంలోని పలు దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కాత్యానీదేవిగా, దత్తపాదుకా క్షేత్రంలో మీనాక్షీ దేవిగా అలంకరించారు. వేయిస్తంభాలగుడి, కమటేశ్వరాలయం, ఇతర దేవాలయాలలో కూడా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



అద్దంకిలో మీనాక్షిదేవిగా అమ్మవారు, నక్కబొక్కలపాడులో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, చీరాలలో నగదుతో అలంకరణ

చీరాల : స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం రూ. 2 లక్షల నగదుతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే శివానందలహరి పారాయణంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాలుగవ రోజు అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. పూజలు అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రేణంగివరం త్రిశక్తిపీఠంలో, అద్దంకిలో వాసవీమాత ఆలయంలో కాత్యాయనిదేవి అలంకరణ

పర్చూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను మండలంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి అలయంలో శ్రీ కాత్యానిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవ వేడుకల అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ రాకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి దామా నాగేశ్వరరావు సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోలీసులు అభద్రతా భావంతో ఉండొద్దు

● ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
● సైబర్, ఆన్‌లైన్, గంజాయి, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది అభ్రదతా భావంతో పనిచేయాల్సిన అవసరం లేదని, కచ్చితమైన శాంతిభద్రతల కోసం పాటు పడాలని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. గురువారం ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతే కాకుండా పీజీఆర్ఎస్ పెండింగ్‌లపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ చీరాల పరిధిలోని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రౌడీ షీటర్‌ల ప్రత్యేక శైలిని గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. వీటి నియం త్రణకు ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. అలాగే గంజాయి, శాంతి భద్రతలపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అమాయక ప్రజలకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని మాట్లాడారు. ఎస్పీ వెంట రూరల్ సిఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వరరావు

మంత్రిని కలిసిన ధర్మకర్తల మండలి సభ్యులు

అద్దంకి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులైన 11 మంది సభ్యులు గురువారం రాత్రి తాడేపల్లిలో క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులుగా నియమితులైన చుండూరి మురళీసుధాకరరావు, ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకటనారాయణమ్మ, దూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, ఆరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కొనంకి సుబ్బారావులు మంత్రి రవికుమార్‌ను కలిశారు.



మంత్రితో ధర్మకర్తల మండలి సభ్యులు

గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాండిచేరి యూనివర్శిటీకి చెందిన 15 మంది విద్యార్థులు సామాజిక, ఆర్థిక పరిశోధన కోసం ధైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రిచర్స్ ఫౌండేషన్‌కు వచ్చారు. గురువారం వారంరోజుల పరిశోధన పూర్తి చేసుకున్న విద్యార్థులు గ్రామస్థులతో మాట్లాడి అన్ని కోణాలలో సమగ్ర అధ్యాయనం చేశామన్నారు. యూనివర్శిటీ ప్రొఫెసర్ కె. దేవన్ నాయకత్వంలో గ్రామ వ్యవస్థ, గ్రామ పరిపాలన, గ్రామీణ వృత్తులు, జీవన విధనాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన అంశాలపై విశ్లేషనాత్మక అధ్యాయనం చేశారు. కార్యక్రమంలోకిరణ్ జ్యోతి రిచర్స్ ఫౌండేషన్ ఫౌండర్ ట్రష్టి కందెపు రాజశేఖర్, సొసైటి అధ్యక్షుడు మద్దినేని రాఘస్వామి, గుండపనేని ఆనంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రీసెర్చ్ ఫౌండేషన్ వద్ద విద్యార్థులు

దసరా మామూళ్లతో బెంబేలు

● సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అదనపు భారం

అద్దంకి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): దసరా మాముళ్ల వసూలు కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ పరిచయం ఉన్న బైక్ మెకానిక్‌లు మొదలు మున్సిపల్ కార్మికుల వరకు పలువురు చేతిలో పుస్తకాలు పెట్టుకొని దసరా మాముళ్ల వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు కొన్ని సంవత్సరాలుగా పలు రహదారుల వెంబడి మహిళలు సమూహాలుగా ఉండి వాహనచోదకుల నుండి మాముళ్ళ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో అద్దంకి, బల్లికురవ మండలాలలోని పలు ప్రధాన రోడ్లలో మహిళలు సమూహాలుగా నిలబడి వాహనచోదకుల నుండి బలవంతంగా దసరా మాముళ్ల వసూలు చేస్తున్నారు. ఇదో కొత్తరకం దందా అని స్థానికులు నోరెళ్లబెడుతుండగా, సామాన్యులకు మాత్రం జేబులకు చిల్లులు తప్పడం లేదు.

మ్యాజిక్ డ్రైన్ పనుల పరిశీలన

మార్టూరు, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో నిర్మిస్తున్న సోక్‌ఛానల్(మ్యాజిక్ డ్రైన్) పనులను గురువారం డ్వామా ఏపీడీ బి.సింగయ్య పరిశీలించారు. ఈ గ్రామంలో రూ.4లక్షలకు పైగా వ్యయంతో 700 మీటర్లు మ్యాజిక్ డ్రైన్ పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే పూర్తయిన 100 మీటర్లు పనులను సింగయ్య పరిశీలించారు. నాణ్యతతో పనులను పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అంతేగాకుండా వీలైనంత త్వరితంగా సైడుకాల్వల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు

● రూ.2.57 కోట్లు విడుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ

పర్చూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి సీసీ రోడ్లు, కల్వర్లు నిర్మాణం కోసం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 2.57 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆమేరకు గురువారం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పనులు చేపట్టనున్నారు.

విద్యా, వైద్య రంగాలకు కూటమి పెద్దపీట

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ గల నాయకులని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. గురువారం అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 16 వేల మంది కొత్త ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు వివరించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వైద్యచికిత్సల కోసం ఎల్‌వోసీ అందజేత

పంగులూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పంగులూరులో ఇద్దరు వ్యక్తులకు వైద్య ఖర్చులకోసం మంజూరైన ఎల్‌వోసీలను గురువారం బాధితులకు అందచేశారు. గ్రామానికి చెందిన పఠాన్‌జిలాని కుమార్తె పుట్టుకతో అనారోగ్యానికి గురయ్యారు. కాగా వైద్యఖర్చుల కోసం రూ.1.50లక్షలను మంజూరు చేశారు. అదేగ్రామానికి చెందిన మేడూరి చాముండేశ్వరికి ప్రమాదవశాత్తు కాళ్లకు గాయాలయ్యాయి. వైద్య ఖర్చుల నిమిత్తం ముందుగా, రూ.1.25 లక్షలను మంజూరు చేస్తూ ఎల్‌వోసీ మంజూరైంది. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో ఎల్‌వోసీలను టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ గురువారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి కోటేశ్వరరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

27 వార్డులుగా అద్దంకి మున్సిపాలిటీ



అద్దంకి పట్టణం వ్యూ

అద్దంకి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీని 27 వార్డులకు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అద్దంకి నగరపంచాయతీగా ఉన్నప్పుడు 20 వార్డులుగా ఉండగా, అనంతరం మున్సిపాలిటీ గా మార్పు చేశారు. 2026 లో జరిగే మున్సిపల్ ఎన్నికలకు 27 మంది కౌన్సిలర్లను అద్దంకి పట్టణ ప్రజలు ఎన్నుకోవాల్సి ఉంటుంది. 29వ తేదీ లోపు మున్సిపల్ అధికారులు 27 వార్డులుగా విభజించి హద్దులను నిర్ధారిస్తూ ప్రకటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అక్టోబర్ 6వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలనలోనికి తీసుకుంటామన్నారు. 14వ తేదీ నాటికి అన్ని స్థాయిలలో ప్రక్రియ పూర్తి చేసి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో 31,870 మంది ఓటర్లు ఉండగా జనాభా సుమారు 50 వేల వరకు ఉన్నారు.

ముప్పాళ్లలో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 25,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో ముప్పాళ్లలో నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు (68) గురువారం మృతి చెందగా గుంటూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. ఇటీవల మృతుడు వెంకటేశ్వర్లు కుమారుడు నాలుగు నెలల కిందట చనిపోగా నేత్రదానం చేశారు. మూడు నెలల కిందట భార్య మృతి చెందగా నేత్రదానం చేశారు. ఒకే కుటుంబంలో ముగ్గురు నేత్రదానం చేశారు.

వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన



వైద్యశాలను సందర్శించిన హైస్కూల్ విద్యార్థులు

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పి. అంజనీదేవి తెలిపారు. గురువారం మేదరమెట్ల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను మేదరమెట్ల ప్రాథమిక వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య విద్యమీద అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్య గురించి విద్యార్థులకు వైద్యులు డాక్టర్ చిట్టిబాబు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పార్మాసిస్టు, ఏఎన్ఎం, స్టాప్ నర్సు, ఇతర విభాగాలలో బాధ్యతులు నిర్వహించే వారి గురించి వివరించారు. ఒకేషనల్ ట్రైనర్ కే.రమ్యలత మాట్లాడుతూ విద్యార్థులు అన్ని వృత్తి విద్యాల గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిబాబుతో పాటు డాక్టర్ శ్రావణి, డాక్టర్ మేర్సీ జోసఫ్, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో రైతులకు తగ్గనున్న ఖర్చు



రైతులకు వివరాలను తెలియజేస్తున్న ఏవో రామ్‌మోహన్‌రెడ్డి

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నూతన డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకుని ఖర్చులు తగ్గించుకోవచ్చని ఏవో రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రావినూతలలో వ్యవసాయ సాంకేతిక యాజమాన సంస్థ (ఆత్మ) సౌజన్యంతో డ్రోన్‌తో పురుగుమందుల పిచికారి ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ డోస్‌తో పిచికారి చేసుకోవచ్చన్నారు. ఎరువులను పిచికారి చేసేటప్పుడు పురుగుమందులను కలపకూడదన్నారు. మినుము, మొక్కజొన్న పంటలపై డ్రోన్‌తో పురుగుమందులను పిచికారి చేసి చూపించారు. 12 లీటర్ల నీటితో ఒక ఎ కరానికి పురుగుమందులు పిచికారి చేయవచ్చన్నారు. దానికి అ నుగుణంగానే పురుగుమందులను కలుపుకోవాలన్నారు. 5 నిమిషాలలో పురుగుమందులు పిచికారి చేయడం పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆత్మ అధికారి రామిరెడ్డి, వీహెచ్‌ఏలు ప్రశాంతి, గోపి, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రివిజన్‌కు సహకరించాలి

● వివిధ రాజకీయ పార్టీలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూచన

అద్దంకి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా రివిజన్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి అన్నారు. పలు రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంగులూరు తహసీల్దార్ శింగారావు, అద్దంకి మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, పలు మండలాల డీటీలు,, టీడీపీ, వైసీపీల తరపున నాగినేని రామకృష్ణ, జ్యోతి హనుమంతరావు పాల్గొన్నారు.



నేతలకు సూచనలిస్తున్న విజయజ్యోతి కుమారి

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాజ్ఞలు

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అక్టోబరు 2 నుంచి ప్లాస్టిక్ నిషేదాజ్ఞలు అమల్లోకి వస్తాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలు, స్థానిక ఎమ్మెల్యే కొండయ్య సూచనలు మేరకు ప్లాస్టిక్ నియంత్రణకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ప్లాస్టిక్ కవర్ల వినియోగం, అమ్మకాలు, నిల్వలు, తయారీ చట్టరీత్యా నేరమని సూచించారు. అలాగే గోవులను ఇష్టారీతిగా వదిలేసిన యజమానులపై చర్యలు తప్పవన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



అద్దంకి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీనరశింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. పలువురు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్ష్మీనరశింహస్వామి గ్రామోత్సవాలు ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నారు.